# కవుల రైలు

కొంత మంది బెంగాలీ సాహితీ పిపాసులు బొంబాయి ఎక్స్‌ప్రెస్ రైలుకు 'గీతాంజలి' అని ముద్దుగా పేరు పెట్టుకున్నారు. అంతటితో సరిపోక, ''శ్రీ రవీంద్రనాథ్ ఠాగూర్'' వ్రాసిన 'గీతాంజలి' నుండి నాలుగు వాక్యాలు అందంగా వ్రాసి మొదటి కంపార్ట్‌మెంటుకు ఫ్రేమ్‌చేసి బిగించారు.

ఆ ప్రక్రియ చూడముచ్చటగా వుండడంతో మన తెలుగు పిపాసులు కూడా మనరైలు బళ్ళకు తెలుగు కవుల, కావ్యాల పేర్లు పెట్టుకుని తెగ మురిసిపోయారు. అవి ఉదాహరణగా కొన్నింటిని చిత్తగించ ప్రార్థన!

తెలుగు పలుకుల పసిడి వెలుగుల మన హైదరాబాదు! ఇవి ఎన్నెన్నో భాషల పువ్వులు పూసిన పొదు కనుక హైదరాబాద్ నుండి ఢిల్లీ వెళ్ళే ఎక్స్‌ప్రెస్‌కు శ్రీ శ్రీగారి 'మహాప్రస్థానం' అని పేరు పెట్టారు. బాగానే వుందనుకునేలోగా, కొంత మంది ప్రయాణీకులు అసంతృప్తిని వెళ్ళడించారు. కారణం ఏమిటి? అంటే ఎవరితోనైనా చెప్పేటప్పుడు ''నేను రేపు ''మహాప్రస్థానానికి'' వెళ్తున్నాను''! అని చెప్పాలంటే ఇబ్బంది కనుక!

కాకినాడ నుంచి మద్రాసు వెళ్ళే సర్కార్ ఎక్స్‌ప్రెస్‌కు ఆరుద్రగారి ''త్వమేవాహం'' పేరు పెట్టారు. ''అసలు పేరే నోరు తిరగడం తిరగడం లేదాయే! ప్రజలందరూ హాయిగా పలికేందుకు వీలుగా వారి మరో రచనను పేరు నిర్ణయించవచ్చుగా'' అని కొందరు అనుకున్నారు.

తెలుగువారి ఆవేశంలాగా, త్వరగానే బయలుదేరిన ఈ రైలు ఒకసారి విజయవాడ స్టేషన్లో రెండు గంటలు ఆగిపోయింది. దాంతో విసుగెత్తిన ఒక ప్రయాణీకుడు ''నువ్వు ప్రయాణం చేసే రైలు ఎప్పుడూ ఒక జీవితకాలం లేటు!'' అని చాకోస్‌తో వ్రాసి సంతృప్తిపడ్డాడు. మరికొందరు ''అంత మంచి పేరు దీనికి పెట్టడం ఎందుకు! కుంటినడక నడిచే ఈ రైలుకి సర్కార్ ఎక్స్‌ప్రెస్ అన్న పేరు రైటు'' అన్నారు.

విజయవాడ నుంచి కాకినాడ రాత్రి పదకొండు గంటలకు బయలుదేరే ఒక పాసింజరుకు కృష్ణశాస్త్రిగారి ''కృష్ణపక్షం'' అని పేరు పెట్టారు. ప్రయాణికులంతా, మన సాహితీ పిపాసుల సందర్భ శుద్ధికి తెగమెచ్చుకున్నారు. కారణం! అందులో ఫ్యాన్లు, లైట్లు వుంటాయిగానీ, పని చెయ్యవు ప్రతి బోగీలోనూ గంపెడు చీకటి పేరుకు పోయి వుంటుంది.

ప్రజలు, ప్రయాణీకులు, ఆ విస్మయం నుండి ఇంకా తేరుకోకముందే కాజీపేట నుండి వాల్తేరు వెళ్ళే పాసింజరుకు గోపీచంద్‌గారి ''అసమర్థుడి జీవిత యాత్ర'' అని పేరు పెట్టుకుని, తెగ మురిసిపోయారు.

ప్రజలంతా మన సాహితీ పిపాసు సందర్భ శుద్ధేకాక, చమత్కార ప్రియత్వానికి కూడా ఎంతో ఆనందించారు. కారణం! ఇది ఉదయం కాజీపేటలో బయలుదేరి, మధ్యాహ్నానికి వాల్తేరు చేరాలి! కానీ సాధారణంగా సాయంత్రానికిగాని చేరేది కాదు కనుక!

ఆ తరువాత తిరుపతి వెంకట కవుల రచనలు, చిలకమర్తివారి ''ఉద్యోగ విజయాలు'' కూడా కొన్ని రైళ్ళకు పెడదాం అని సంబరపడ్డారుగానీ, వారిని వారి రచనలనూ వెనకేసుకు వచ్చే గ్రూపులు లేకపోవడంతో నిరుత్సాహపడి మానేశారు. విశ్వనాథగారు అటు ప్రాచీనంలో నడుస్తు, ఇటు అభ్యుదయంవైపుకూడా అడుగు వేశారు కనుక, డోర్నకల్ నుండి కొత్తగూడెం వెళ్ళే పాసింజరుకు ''కిన్నెరసాని'' అని పేరు పెడదామనుకున్నారు.

కానీ.. ఆయన శిష్యులు కోప్పడ్డారు! పాసింజరు ఖర్మేమిటి? హైదరాబాద్ నుండి ఢిల్లీ వెళ్ళే ఆంధ్రప్రదేశ్ ఎక్స్‌ప్రెస్‌కు ''వేయి పడగలు'' పెట్టండి! అన్నారు.

ఇలాగ వాదోపవాదాలు చెలరేగడంతో సాహితీ పిపాసులు, మన కవులకు, వారి రచనలకూ సరి అయిన న్యాయం చేకూర్చలేమేమో! అన్న భయంతో ఆరంభశూరత్వంతో పూనుకున్న పనిని మానుకున్నారు!

– సూరంపూడి విశ్వం

## మినీకథ

# వీరభద్రయ్య

పేరుకు తగ్గట్టుగానే వీరభద్రయ్య భయంకరంగా వుంటాడు. బుగ్గమీసాలు, కండలు తిరిగిన శరీరం, ఆరడుగుల పొడవు, చింతనిప్పుల్లాంటి కళ్ళు.

'తప్పదయ్యా! ఇయ్యాల ఎలాగైనా సరే నరికెయ్యాల! ఎవడడ్డొచ్చినా సరే ఆగేది లేదు' అనుకున్నాడతను. తన ఇంటి మూలలో దాచిన కత్తి తీశాడు. ఓసారి దాని పదును తడిమి చూశాడు. కత్తిని నూరి ఒరపై పెట్టి ఇసుక వేసి సానపట్టాడు. తెల్లగా ధగధగా మెరిసిపోతుందా కత్తి. మళ్ళీ ఓసారి దాని పదును తడిమి చూశాడు. కత్తిని నూరి ఒరపై పెట్టి ఇసుక వేసి సానపట్టాడు. తెల్లగా ధగధగా మెరిసిపోతుందా కత్తి. మళ్ళీ ఓసారి పదునును తడిమి చూసి తలపంకించాడు. కత్తి భుజాన వేసుకున్నాడు. పల్నాటి యుద్ధంలో కన్నమ దాసులా బయలుదేరాడు. వీధిలో ఒక వైపు నుంచి మొదలుపెట్టాడు నరకడం. వీరవిహారం చేసేస్తున్నాడు. 'సర్... సర్... సర్...' తలలు తెగి నేలమీద పడుతున్నాయి. 'బాబూ! వీరభద్రయ్యా! ఇది అన్యాయం. ఆగవయ్యా!' జనం బతిమాలుతున్నారు. అబ్బే! వీరభద్రయ్య ఆగలేదు. మీసం మెలేసి మరీ నరుకుతున్నాడు. అతని కత్తికి ఎదురు లేకుండా పోయింది. అంతా గుడ్లప్పగించి చూస్తున్నారు. ఎవరూ సాహసించి అతన్ని ఆపడంలేదు. తలలు ఒడిసిపట్టుకుని మరీ నరుకుతున్నాడు. వీధంతా నిర్జీవంగా బావురుమంటోంది. తను అనుకున్న పని ముగించాక, ఒకసారి మీసం మెలేసి కత్తి భుజాన వేసుకుని పెద్దపెద్ద అంగలు వేసుకుంటూ వెళ్ళిపోయాడు... కరెంటు లైన్‌మెన్ వీరభద్రయ్య! అతని చేత తలలు నరకబడిన చెట్లు జాలిగా చూస్తున్నాయి.

–గుబ్బల సత్యనారాయణమూర్తి.

